ప్రజాశక్తి
శనివారం 17 డిసెంబర్ 2022
5
అల్లూరి సీతారామరాజు

అంగన్‌వాడీ ఆయా పోస్టుల భర్తీకి
27లోగా దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -డుంబ్రిగూడ: మండలంలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ ఆయా పోస్టుల భర్తీకి ఈనెల 27లోగా దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు స్థానిక ఐసిడిఎస్ సిడిపిఒ కె.నిర్మల చెప్పారు. శుక్రవారం స్థానిక విడుదల చేసిన పత్రిక ప్రకటనలో, మండలంలోని తూటంగి పంచాయితీ బల్లకట్టు, అరకు పంచాయితీ అరకు కొండవీడి అంగన్వాడీ కేంద్రాల్లో రెండు ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ నెల 17 నుంచి 27 వరకు ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై, ఈ ఏడాది జూలై 1 నాటికి 21 ఏళ్ళ నుంచి 35 సంవత్సరాలలోపు స్థానిక అభ్యర్థులు అర్హులన్నారు. పూర్తి వివరాలకు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. డుంబ్రిగుడతోపాటు ముంచంగిపుట్టు, అనంతగిరి తదితర మండలాల్లోనూ అంగన్వాడీ ఆయాల పోస్టులను దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు.

మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన

రక్తదాన శిబిరంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : విజయ్ దివస్ సందర్భంగా జాతీయ సేవా పథకం పాడేరు ఆధ్వర్యంలో రక్త చైతన్యకర్త, రాష్ట్ర సేవా పురస్కార్ అవార్డు గ్రహీత గజేష్ కొమ్మెట్లు సహాయ సహకారంతో రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు సౌజన్యంతో శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. అమర సైనికులకు నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, అనంతరం మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యవంతులైన యువకులు ప్రతి మూడు నెలలకోసారి రక్తదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. కిల్లో అబ్బాయి, జిల్లా ఆరోగ్య అధికారి డాక్టర్ శంకర్‌ప్రసాద్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు గౌరీ శంకరరావు, పి రమేష్‌కుమార్, రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు సెక్రటరీ ఈశ్వరరావు, రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు ఎస్ గంగరాజు, కోశాధికారి పి.అప్పారావు, రెడ్ క్రాస్ కమిటీ సభ్యులు కొమ్మెట్ల రమణ, కొమ్మెట్ల గోవింద్,కె. ప్రసాదనాయుడు, డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు రక్తదాతలు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రాల్లో పోలీసుల హెల్ప్‌డెస్క్

సద్వినియోగం చేసుకోవాలని సిఐ బాబు వినతి

పర్యాటకులతో మాట్లాడుతున్న సిఐ బాబు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్ : అల్లూరి జిల్లా ఎస్‌సి సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయ గిరిజన మ్యూజియం, పద్మావతి గార్డెన్, కాఫీ మ్యూజియం, బస్ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్‌లో అరకు సిఐ జిడి.బాబు ఆధ్వర్యాన పోలీసుల ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. పర్యాటక కేంద్రాలకు వచ్చే సందర్శకులు ఇక్కడ అందాలను ఆస్వాదించి, తగు జాగ్రత్తలతో తిరిగి వెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా అరకు సిఐ బాబు మాట్లాడుతూ దేశ విదేశాల నుంచి వచ్చే పర్యాటకులకు అవసరమైన సమాచారం, సలహాలు సూచనలు ఇచ్చే ఉద్దేశ్యంతోనే ఈ హెల్ప్‌డెస్క్‌ను పోలీస్‌శాఖ ద్వారా ఏర్పాటు చేస్తాన్నామని, పర్యాటకుల కావాల్సిన వివరాలను ఈ హెల్ప్‌డెస్క్‌లో తెలుసుకోవచ్చున్నారు. ఈ డెస్క్‌లో పోలీసు సిబ్బందితోపాటు ఒక గైడ్ ఉంటారని, టూరిస్ట్ ప్రాంతాల సమాచారం తెలియజేస్తారన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్, మహిళ పోలీసులు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాలకు భూములివ్వం

ఆందోళన చేస్తున్న నిర్వాసిత గిరిజనులు

ప్రజాశక్తి- అనంతగిరి : ఏకలవ్య పాఠశాల ఏర్పాటుకు తమ జిరాయితీ భూములను ఇవ్వబోమంటూ రైతులు ఆందోళన దిగారు. మండలంలోని అనంతగిరి పంచాయతీ పాతకోట గ్రామంలో ఏకలవ్య పాఠశాల ఏర్పాటుకు రైతులు ముందుకు వచ్చి సుమారు 12.80 ఎకరాల భూమి ఇచ్చేందుకు అంగీకరించారు. అయితే భూములు కోల్పోయిన తమకు ప్రభుత్వ భూమి ఎంతో కొంత కేటాయించాలని రైతులు వెంకటరావు, సింహాద్రి. డిమాండ్ చేశారు ఏకలవ్య పాఠశాలకు భూసేకరణ సమయంలో ఇచ్చిన ఒప్పందం మేరకు భూములిచ్చిన ఐదుగురు రైతులకు పంచాయతీ పరిధిలో వేరోచోట భూమినికేటాయిస్తామన్న మాటను నిలబెట్టుకోవాలని జెడ్‌పిటిసి, సర్పంచ్‌తో కలిసి వెళ్లి తహశీల్దార్, ఇతర అధికారులకు విన్నవించామని, ఇటీవల కలెక్టర్‌ను కలిసి లిఖితపూర్వకంగా కోరామన్నారు. అయితే అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేని పరిస్థితుల్లో తమ భూములను ఏకలవ్య పాఠశాలకు ఇచ్చి తాము నష్టపోవాలనుకోవడం లేదని రైతులు అంటున్నారు. తక్షణం అధికారులు స్పందించి తగుచ ర్యలు చేపట్టాలని కోరారు.

పర్యాటక రంగంలో ఉద్యోగావకాశాలకు శిక్షణ

ప్రజాశక్తి -అరకు రూరల్ : పర్యాటక రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యాన అరకువేలిలో యువజన శిక్షణ కేంద్రం (వైటిసి)లో నిరుద్యోగ యువతకు శిక్షణనివ్వనున్నట్లు ఎంపిడిఒ వెంకటేశ్వరరావు తెలిపారు. డిగ్రీ ఉత్తీర్ణులై, 18–30 ఏళ్ల వయస్సుగల నిరుద్యోగ స్త్రీ పురుష అభ్యర్థులు విదార్హత ధ్రువీకరణలతో అరకువేలి వైటిసిలో హాజరుకావాలని తెలిపారు. ఎంపికైన వారికి ఈనెల 19 నుండి శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు.

ఎంపికైన అభ్యర్థులకు టూరిజం రంగంలో ఫుడ్ అవుట్‌లేట్ మేనేజర్, హౌస్‌కీపింగ్ మేనేజర్ ఉద్యోగాలకు ఆరునెలలు శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి సౌకార్యలను కల్పిస్తారన్నారు. అధునతమైన ల్యాబ్‌లలో శిక్షణనిచ్చి, ఉద్యోగావకాశాలను కల్పిస్తారన్నారు. పూర్తి వివరాలకు 63030 00080;94925 72737; 94910 70295 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో అగ్నిమాపక అధికారుల ప్రతిభ

ప్రజాశక్తి-పాడేరు: రాష్ట్రస్థాయి అగ్నిమాపకశాఖాధికారుల బ్యాట్మింటన్ డబుల్స్ పోటీలలో విజేతలుగా నిలిచిన ప్రాంతీయ అగ్నిమాపకాధికారి భూపాల్‌రెడ్డి, అల్లూరి జిల్లా అగ్నిమాపకాధికారి పేరూరి శ్రీనివాస్‌లను ఆ శాఖ డైరక్టర్ జనరల్ ఎన్.సంజయ్ అభినందించి జ్ఞాపికను బహూకరించారు.

విజేతలను అభినందిస్తున్న డీజీ సంజయ్

ప్రిన్సిపల్ బాధ్యతారాహిత్యంతోనే
గిరిజన ఆశ్రమ విద్యార్థి మృతి

రాస్తారోకో నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ, గిరిజన సంఘం నేతలు, విద్యార్థులు

ఎస్ఎఫ్ఐ, గిరిజన సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో
బాధిత కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం చెల్లించాలి
ప్రిన్సిపల్ సస్పెన్షన్, బాధ్యులపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి - జి.మాడుగుల : గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థి జర్త కొండబాబు మృతికి పాఠశాల ప్రిన్సిపల్ బాధ్యతారాహిత్యమే కారణమని నిరసిస్తూ శుక్రవారం ఎస్ఎఫ్ఐ, గిరిజన సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సాగిన ధర్మన్నపడాల్, జిల్లానాయకులు జగ్గందొర దీనబంధు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పాంగి జీవన్‌కృష్ణ, కొర్ర కార్తీక్ విడుదల చేసిన ప్రకటనలో ఈనెల 6న స్థాని గిరిజన గురుకులంలో విద్యార్థుల మధ్య ఘర్షణలో తొమ్మిదో తరగతి విద్యార్థి జర్త కొండబాబు తీవ్ర గాయాలపాలైన విషయం తెలిసిందే. గురుకులంలో ఉన్న విద్యార్థికి గాయాలైన పరిస్థితుల్లో మెరుగైన వైద్యం అందించడంతోపాటు అతని మెరుగైన ఆరోగ్యానికి చర్యలు తీసుకోవాల్సిన ప్రిన్సిపల్ నిర్లక్ష్యంగా మరుసటి రోజున స్థానిక పిహెచ్‌సిలో హెల్త్ అసిస్టెంట్ వద్ద నామమాత్రం వైద్యం అందించి, తీవ్రజ్వరం ఉన్నప్పటికీ మరో విద్యార్థిని తోడు ఇచ్చి కొండబాబును అతని ఇంటికి పంపేసి చేతులు దులుపుకున్నారని, తర్వాత విద్యార్థి ఆరోగ్యం ఎలా ఉందో కనీసం ఆరా తీయలేదన్నారు. ఈ నేపథ్యంలో గాయాలతో తీవ్రజ్వరం అస్వస్థతకు గురైన కొండబాబును ఈ నెల 14న జి.మాడుగుల పిహెచ్‌సికి అతని తల్లిదండ్రులు తీసుకురాగా, ఆరోగ్యం విషమంగా ఉండడంతో విశాఖ కెజిహెచ్‌కు రిఫర్ చేయగా అక్కడ ఈ నెల 15న మృతి చెందాడన్నారు.

గురుకులంలో విద్యార్థుల గొడవ ఘటన విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజెప్పకపోవడం, దాడి చేసిన విద్యార్థులపై ఇప్పటివరకు ఎటువంటి క్రమశిక్షణ చర్యలు తీసుకోకపోవడం వంటి బాధ్యతారాహిత్య చర్యల ద్వారా ఘటనను కప్పిపుచ్చాలని చూసి విద్యార్థి మృతికి కారకులైన ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేసి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతనెలలోనూ పాఠశాలలో తాగునీటి సమస్యపై ప్రశ్నించిన ఇద్దరు విద్యార్థులను విచక్షణారహితంగా కొట్టిన ఆరోపణలున్న ఉదంతంపై ప్రిన్సిపల్‌పై విచారణ జరపాలని కోరారు. మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వపరంగా రూ.25లక్షల పరిహారం, ఇతర సౌకర్యాలను అందించి న్యాయం చేయాలని కోరారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాలల్లోకి ఎవరూ వెళ్లకుండా ఆంక్షలు అమలు చేస్తున్న అధికార యంత్రాంగం, సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధి చూపడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సభ్యులు మల్లేష్ భగీరథ, భాస్కర్, శ్రీను విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా సిసి రోడ్డుకు మరమ్మతులు

గ్రామస్తుల విరాళం, యువత సహకారంతో పనులు చేపట్టిన సర్పంచ్

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: గ్రామంలో అధ్వానంగా ఉన్న సిసిరోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఎన్నోమార్లు అధికారులు, నేతలకు విన్నవించారు. తమ గోడు అరణ్యరోదనే తప్ప ఏ ఒక్కరూ స్పందించని పరిస్థితుల్లో సర్పంచ్ చొరవ తీసుకోవడంతో గ్రామస్తులంతా సంఘటితమై తలో కొంత విరాళం వేసుకుని నిధులు సమీకరించారు. యువత సహకారంతో అధ్వానంగా ఉన్న సిసిరోడ్డుకు స్వచ్ఛందంగా మరమ్మతులు చేపట్టారు. వివరాల్లోకి వెళితే...మండలంలో కిలగాడ పంచాయతీ కేంద్రంలోని పెద్దవీధి సిసి రోడ్డు అధ్వానంగా ఉండడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. రోడ్డు బాగు చేయాలని సర్పంచ్ శివశంకర్ ఆధ్వర్యంలో పలుమార్లు అధికారులు, నేతలకు విన్నవించారు. ఏ ఒక్కరూ స్పందించని పరిస్థితుల్లో గ్రామప్రజలే స్వచ్ఛందంగా ముందుకొచ్చి విరాళాలు వేసుకుని, సిసిరోడ్డులోని గోతులకు మరమ్మతులు చేపట్టారు. అస్తవ్యస్తంగా ఉన్న సిసిరోడ్డుతో ప్రజల అవస్థలను గుర్తించిన సర్పంచ్ శివశంకర్,

పెద్దవీధి రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న యువత

పంచాయతీ ఖాతాలో నిధులు లేకపోవడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితుల్లో విషయాన్ని గ్రామస్తులకు చెప్పారు. తలోచేయి వేసి, విరాళాలను సమీకరించి, సర్పంచ్ ఆధ్వర్యంలో యువత సహకారంతో ఎవరో వస్తారని ఎదురుచూడకుండా మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ శివశంకర్ మాట్లాడుతూ, మారడంతో ప్రభుత్వానికి అనేకమార్లు వినతిలిచిన నిధులు మంజూరు కాకపోవడంతో సర్పంచ్ శివశంకర్, గ్రామ ప్రజలు సొంత నిధులు సమీకరించి సిసి రోడ్డును మరమ్మత్తులు చేశారు. గ్రామ ప్రజల పడుతున్న అవస్థలను గుర్తించి రవాణా సౌకర్యాన్ని గ్రామపంచాయతీ ఏటువంటి నీదులు లేనప్పటికీ గ్రామములో ఉన్న యువత, స్థానిక సర్పంచ్ చొరవతీసుకొని చిన్న చిన్న గుంతలను మరమతులను చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీలో పరిధిలో అనేక సమస్యలున్నప్పటికీ నిధులు కొరతతో ఏం చేయలేని పరిస్థితి ఉందని, దీంతో అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరించాలని కోరినా ఎటువంటి స్పందన లేకపోవడంతో ప్రజలంతా ఏకమై సమస్యను తాత్కాలికంగా పరిష్కరించామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, అధ్వాన సిసి రోడ్డుకు శాశ్వతంగా పటిష్టం చేయాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు బి.శ్రీనివాస్‌పడాల్, వాలంటీర్లు కె.బాబూలాల్, బి.రాంబాబు, స్థానిక యువత రాజుబాబు, ఎం.కృష్ణమూర్తి, ఎం.అనిల్‌కుమార్, వి.సత్యనారాయణ, కె.మహేష్, కామరాజు తదితరులు పాల్గొన్నారు.

అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు సూరిబాబు

నేడు హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా బంద్

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని పెద మాకవరం పంచాయితీ, గానుగుల, చింతపల్లి మండలం యర్రవరం ప్రాంతాల్లో నిర్మించనున్న హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌కు వ్యతిరేకంగా ఈ నెల 17న శనివారం మండల బంద్ నిర్వహిస్తున్నట్లు అఖిల పక్ష పార్టీలు తెలిపాయి. శుక్రవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు వల్ల గిరిజనులు పంట పొలాలు, జీడి మామిడి తోటలు, ఇళ్లు, స్థిర, చరాస్తులు కోల్పోయి నిరాశ్రయులవుతారని తెలిపారు. ప్రజలు, మేధావులు, ప్రజాతంత్ర వాదులు బంద్‌ను జయప్రదం చెయ్యాలని విజ్ఞప్తి చేశారు. వర్తక సంఘం, ఆటో, మోటార్ ఇలా అన్ని వర్గాల ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో గిరిజన సంఘం నాయకులు ఎస్.సూరిబాబు, జనసేన, టిడిపి, సిపిఐ, సిపిఎం ఎస్.బుజ్జిబాబు, జి.శ్రీనివాసు, సిహెచ్.ప్రసాద్, ఇ.దేముడు, జి.నూకరాజు, పి.చిన్నారావు, ఇ.బుజ్జిబాబు, వై.అప్పల నాయుడు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో మాట్లాడుతున్న అరకు ఎంపీ మాధవి

పోస్టులు భర్తీ చేయండి

- పార్లమెంట్‌లో అరకు ఎంపీ మాధవి విజ్ఞప్తి

ప్రజాశక్తి-కొయ్యూరు

ఏజెన్సీలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని అరకు ఎంపీ జి.మాధవి శుక్రవారం పార్లమెంట్‌లో విజ్ఞప్తి చేశారు పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో శుక్రవారం ఆమె మాట్లాడుతూ కాఫీ పరిశ్రమ అవసరాలు, గిరిజన సాగుదారులకు శాస్త్రీయ సాంకేతిక సలహా అవసరాలను తీర్చడానికి వెంటనే ఖాళీగా ఉన్న స్థానాలను భర్తీ చేయాలని కోరారు. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా దాఖలు చేయాల్సిన 547 సవరించిగా మొత్తం 152 ఖాళీలు ఏర్పడ్డాయని తెలిపారు.

పవర్ కెనాల్ గండి పూడ్చడానికి చర్యలు

ప్రజాశక్తి -సీలేరు

డొంకరాయి పవర్ కెనాల్ మరమ్మతు పనులు చేపట్టడానికి చర్యలు వేగవంతం చేస్తున్నామని సీలేరు కాంప్లెక్స్ ఎస్ఈ సివిల్ కేకేవి.ప్రశాంత్ కుమార్ వెల్లడించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డొంకరాయి పవర్ కెనాల్‌కు గండి పడిందని వెంటనే అప్రమత్తమైన తమ సిబ్బంది సకాలంలో స్పందించి నీటిని నిలుపుదల చేసి చర్యలు చేపట్టడంతో పెనుముప్పు తప్పిందని తెలిపారు. విద్యుత్ సౌద ఉన్నతాధికారి ఆదేశాల మేరకు పవర్ కెనాల్ గండి పనులు చేపడానికి కావలసిన మెటీరియల్ తదితర యంత్ర సామాగ్రి సమకూరుస్తున్నామని పేర్కొన్నారు. దీనికి కోటి రూపాయల నుంచి నుంచి కోటి 50 లక్షలు రూపాయలు ఖర్చు అవ్వచ్చునని అంచనా వేస్తున్నామని చెప్పారు. కెనాల్ గండి పనులు నెలరోజుల వ్యవధిలో పూర్తి చేయడానికి ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. దిగు సీలేరు డొంకరాయిల జల విద్యుత్ కేంద్రంలో 20 మెగావాలు సామర్థ్యం గల ఒక యూనిట్, పోల్లూరు జల విద్యుత్ కేంద్రాల్లో 115 మెగావాట్లు సామర్థ్యం గల నాలుగు యూనిట్లు ఉన్నాయని తెలిపారు. కెనాల్ గండి పనులు పూర్తయితే తప్ప ఈ రెండు జల విద్యుత్ కేంద్రాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేయడం సాధ్యం కాదని వెల్లడించారు. గురువారం హైడల్ డైరెక్టర్ ఎంవివి సత్యనారాయణ సీఈ సివిల్ శేషారెడ్డితో పవర్ కెనాల్ గండి పరిశీలించడం జరిగిందన్నారు. ఇంజనీర్లు పర్యవేక్షణలో నిరంతరం కెనాల్ గండి పనులు పూర్తయ్యే విధంగా కషి చేస్తామని ఆయన తెలిపారు.

గండి పడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జెన్‌కో ఉన్నతాధికారులు

మినీ బస్సు డిపో ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరులో మినీ బసు డిపో ఏర్పాటు జిల్లా ఆర్టీసీ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు అధికారి ఆర్ఎస్.నాయుడు, రీజినల్ సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ శుక్రవారం స్థల పరిశీలన చేశారు. మినీ బస్ డిపో ఏర్పాటు చేయటానికి 5 ఎకరాలు స్థలం కావలసి ఉంది. దీంతో ముందుగా శివాలయం సమీపంలో ఉన్న గ్యాస్ గొడౌన్ పక్కన , ప్రభుత్వ ఆసుపత్రి, సీలేరు ఐటి సమీపంలో ఉన్న స్థలాన్ని పరిశీలించారు. డిపో నిర్మాణం చేపడితే సుమారు 30 బస్సులు నిలుపుదల చేయడానికి కాంప్లెక్స్, బస్సులు మరమ్మతులకు గ్యారేజీ, అధికారులకు కార్యాలయాలు నిర్మించేందుకు అనువుగా ఉండే స్థలాన్ని పరిశీలించారు. స్థల పరిశీల అనంతరం నివేదికను జిల్లా కలెక్టర్ అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ ఆర్‌విఆర్.రాజు, డివివి.నర్సింగరావు, ఏపీ జెన్కో క్యాంప్ ఏడిఈ అప్పలనాయుడు, ఏఇ సురేష్, స్థానిక ఎంపిటిసి పిల్ల సాంబమూర్తి, ఉప సర్పంచ్ వల్లి ప్రసాద్, వైసిపి నాయకులు వెంకట్రావు, మండి చంద్రయ్య, బుజ్జి, సత్తిబాబు పాల్గొన్నారు.

స్థల వివరాలు సేకరిస్తున్న అధికారులు

6 వేల లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని మర్రిపాలెం, చిట్టం పాడు గ్రామాల శివారు ప్రాంతాల్లో నాటు సారా తయారీ జరుగుతున్నట్లు సమాచారంతో పోలీసులు నాటుసారా బట్టీల మీద దాడి చేసి సుమారు 6000 లీటర్ల సారా పులుపును శుక్రవారం ధ్వంసం చేశారు. ఆపరేషన్ పరివర్తనలో భాగంగా గ్రామాల్లో కౌన్సెలింగ్ ఇచ్చారు. నాటు సారా తయారు చేసినా, విక్రయించినా నేరమని, తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు సిఐ స్వామి నాయుడు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లం పులుపు వెలికి తీసిన పోలీసు సిబ్బంది

వైద్యాధికారితో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రభుత్వాసుపత్రిలో మందులు అందుబాటులో ఉంచాలి

ప్రజాశక్తి -చింతూరు

మండలంలోని ఏడుగురాళ్లపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో మలేరియా జ్వర పీడితులకు ఇంజక్షన్లు, మందులు అందుబాటులో ఉంచాలని సిపిఎం మండల నాయకులు మల్లం సుబ్బమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిని సిపిఎం స్థానిక నాయకులు మల్లం సుబ్బమ్మ, సౌలం కన్నయ్య, తాటికొండ కోటేశ్వరరావు, సందర్శించారు. ఆసుపత్రిలో రోగులకు జరుగుతున్న చికిత్సపై అడిగి తెలుసుకున్నారు. మలేరియా జ్వరం నిర్ధారణ అయితే ట్రీట్మెంట్ నిమిత్తం ఇంజక్షన్లు, టాబ్లెట్స్ ప్రైవేటు మందుల షాపు నుంచి కొనుగోలు చేస్తున్నట్లు రోగులు తెలిపారు. ఈ విషయాన్ని స్థానిక డాక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా సెప్టెంబర్ నెలలో ఆసుపత్రికి సంబంధించి మెడికల్ ఇండెంట్ పెట్టినా కూడా ఇంజక్షన్స్ టాబ్లెట్స్ రాలేదని తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకురాలు మల్లం సుబ్బమ్మ మాట్లాడుతూ ఆసుపత్రికి ప్రతిరోజు 60 మందికి తగ్గకుండా రోగులు వస్తున్నారని వారికి మందులు, ఇంజక్షన్లు అందుబాటులో ఉంచకపోవడం సరికాదని పేర్కొన్నారు. బాలింతలు, గర్భిణు, రోగులకు ఆసుపత్రిలో తగిన విధంగా పడక సౌకర్యాలు లేవన్నారు, ఆరు పడకలు మాత్రమే ఉండటం రోగులు ఇబ్బంది పడుతున్నారని, తక్షణమే హాస్పిటలను 50 పడకల ఆసుపత్రిగా మార్చాలని డిమాండ్ చేశారు.

ఘాట్ రోడ్డులో వాహనాలు బోల్తా

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మారేడుమిల్లి - చింతూరు ఘాట్ రోడ్డులో శుక్రవారం వేరువేరు ప్రమాదంలో రెండు లారీలు, ఒక మినీ వ్యాన్ బోల్తా పడ్డాయి. ఈ లారీలు ఒరిస్సా నుండి ధాన్యం లోడుతో రాజమండ్రి వైపు వస్తుండగా బ్రేకులు ఫెయిల్ కావడంతో ప్రమాదం జరిగిందని లారీ డ్రైవర్ తెలిపారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఘాటి రోడ్లో ఓవర్ లోడ్‌తో లారీలు ప్రయాణించడం వలన ఇలాంటి ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయి. ఈ ప్రమాదాల వల్ల తరచూ భారీ ట్రాఫిక్ ఏర్పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయంలో గత్యంతరం లేక చీకట్లోనే బిక్కు బిక్కు మంటూ గడపాల్సిన దుస్థితి ఏర్పడింది అంటున్నారు.

ఘాట్ రోడ్డులో బోల్తా పడిన భారీ లారీ

గ్రావిటీ కుళాయి ప్రారంభిస్తున్న నవనిర్మాణ సంస్థ మేనేజర్

గ్రావిటీ పథకం ప్రారంభం

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు :మండలంలోని అతి మారుమూల వనగుమ్మ పంచాయతీ కిరంబో గ్రామంలో విశాఖపట్నం నవనిర్మాణ సమితి స్వచ్ఛంద సేవాసంస్థ సౌజన్యంతో రూ.ఐదు లక్షలతో నిర్మించిన గ్రావిటీ పథకాన్ని శుక్రవారం ప్రారంభించారు.గ్రామంలో తాగునీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితుల్లో నవనిర్మాణ సంస్థ మేనేజర్ సత్యనారాయణ స్పందించి, కిరంబో గ్రామాన్ని సందర్శించారు. గ్రావిటీ పథకానికి నిధులు మంజూరు చేశారు. గ్రామస్తులంతా శ్రమదానంతో గ్రావిటీ నిర్మాణ పనులకు సహకరించి పూర్తి చేశారు. శుక్రవారం గ్రావిటీ నీటిపథకం కుళాయిలను ప్రారంభించి, స్థానికులకు తాగునీరు అందించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కమిటీ సభ్యుడు కొర్ర శంకరరావు మాట్లాడుతూ కిరంబోలో తాగునీటిఎద్దడిపై ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితుల్లో నవనిర్మాణసమితి స్వచ్ఛంద సంస్థ నిధులు కేటాయించి గ్రావిటీ పథకాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గిరిజనుల సమస్యలన్నీ పరిష్కరించేస్తున్నామని బూటకపు హామీలిచ్చిన నేతలు అమలు చేయని పరిస్థితుల్లో స్వచ్ఛందసంస్థలు గిరిజనం సమస్యలపై స్పందించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యుడు భీమన్న, వాలంటీరు కె.బేసు, పి సీతారామ్, పి రఘు, పి సహదేవ్, కెభాస్కర్, రాజు, పి.కృష్ణ పాల్గొన్నారు.

అనారోగ్యంతో విలేకరి మృతి

విలేకరి నగేష్(ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన విలేకరి శెట్టి నగేష్ (34) గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. కొన్నాళ్లుగా అస్వస్థతకు గురైన నగేష్ ఆరోగ్యపరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కెజిహెచ్‌కు మెరుగైన వైద్యం కోసం తరలించారు. అక్కడ వైద్యసేవలు పొందుతూ, గురువారం అర్ధరాత్రి మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. నగేష్ గతంలో ప్రజాశక్తి దినపత్రికకు గ్రామీణ విలేకరిగా పనిచేశారు. ఎస్ఎఫ్ఐ నేతగా ఉద్యమాల్లో పాల్గొన్నారు. కోనాపురం సర్పంచిగా నగేష్ భార్య రాజేశ్వరి వ్యవహరించినపుడు గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాడని స్థానికులు అంటున్నారు. మృతదేహాన్ని శుక్రవారం అతని స్వగ్రామం కోనాపురం తరలించి, అంత్యక్రియలు నిర్వహించారు. నగేష్‌కు భార్య, ముగ్గురు ఆడపిల్లలున్నారు.

నగేష్ పార్థివదేహానికి పలువురి నివాళి

నగేష్ పార్థివదేహానికి పలువురు రాజకీయ నేతలు, స్థానికులు సందర్శించి నివాళులర్పించారు. అతనికుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు రాష్ట్ర ఎస్‌టి కమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మి, సర్పంచులు జె. అప్పారావు, కె. మొస్య, ఎంపిటిసి టి.మిథుల, వైసిపి నేతలు తదితరులు నగేష్‌కు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

రెండు రోజులు హిందీ నాటకాలు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో భాగంగా, నగర అధికారిక భాషా అమలు కమిటీ, స్టీల్‌ప్లాంట్ సంయుక్తంగా రెండు రోజులు హిందీ నాటకాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 17వ తేదీన సాయంత్రం 6.30 గంటలకు స్టీల్‌ప్లాంట్ ఉక్కు క్లబ్‌లో, 18వ తేదీన సాయంత్రం 6:30 గంటలకు వుడా చిల్డ్రన్స్ థియేటర్‌లో హిందీ ప్లే-లెట్‌లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ రెండు నాటకాలను న్యూఢిల్లీకి చెందిన కళాకారుల బృందం సుఖ్‌మంచ్ థియేటర్ ప్రదర్శిస్తుంది. మొత్తం 42 మంది కళాకారులు 'పూచ్చో పర్సాయి సే' 'గగన్ దమామా బజ్యో' నాటకాలను ప్రదర్శిస్తారని తెలిపారు. ప్రవేశ రుసుము లేదని, అందరూ హాజరై జయప్రదంచేయాలని కోరారు.

శ్రమదానంతో రోడ్డు మరమ్మతులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలానికి చెందిన బాబుశాల పంచాయతీ మొండిగుమ్మ గ్రామ రహదారికి స్థానికులు సమిష్టిగా శ్రమదానంతో మరమ్మతులు చేపట్టారు. బాబుసాల పంచాయతీ కేంద్రం నుంచి సుమారు ఐదు కిలోమీటర్లు దూరంలో ఉన్న మొండిగుమ్మ గ్రామానికి సరైన రోడ్డుకు గ్రామస్తులు సొంతనిధులను సమీకరించి, శ్రమదానంతో రోడ్డును బాగుచేసుకుంటున్నామని ఆ గ్రామ గిరిజనుడు నరేష్ తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో మట్టి రోడ్డు వేసినప్పటికీ, సుమారు కిలోమీటర్ రోడ్డు అధ్వానం మారడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నామన్నారు. 108 వాహనం వచ్చే అవకాశం కూడా లేని పరిస్థితుల్లో గర్భిణులు, అనారోగ్యపీడితులు ఆస్పత్రికి వెళ్లాలంటే నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అతిమారుమూల మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైనప్పటికీ, ప్రభుత్వపరంగా అభివృద్ధి చేసే చర్యలు చేపట్టడం లేదని, వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన గ్రామాల్లో సౌకర్యాల కల్పన మాటల్లోనే తప్ప చేతల్లో ఎక్కడా జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ప్రజలంతా విరాళాలు సేకరించి, శ్రమదానంతో రోడ్డు బాగుచేసుకోవాల్సిన దుస్థితి ఉందని వాపోయాడు. ఇప్పటికైనా ప్రభుత్వపరంగా అధికారులు కళ్లు తెరిచి, మొండిగుమ్మ రోడ్డు బాగు చేయాలని కోరుతున్నారు. కార్యక్రమంలో కొర్ర సుబ్బారావు, జి బాలన్న, గ్రామ యువత, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపడుతున్న గిరిజనులు

ఉద్యోగ, ఉపాధికి వినతుల వెల్లువ

స్పందనకు 56 విజ్ఞప్తులు

స్పందనలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఐటిడిఎలో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం నిర్వహించిన స్పందనకు 56 ఫిర్యాదులు వచ్చాయి.ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, వ్యక్తిగత, సామాజిక సమస్యలపై అధికంగా ఫిర్యాదులు వచ్చాయి. వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించిన కలెక్టర్ సుమిత్‌కుమార్, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు.

జిల్లా ఆసుపత్రిలో ప్రసవించిన పెదబయలు మండలం పెదకోడాపల్లి గ్రామానికి చెందిన ఎస్.రత్నకుమారి తన ఆరోగ్యశ్రీ కార్డును సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని కోరారు. ఖాళీగా ఉన్న ఆశ వర్కరు పోస్టుకోసం పెదబయలు మండలం బొంగరం పంచాయతీ పోతులగరువుకు చెందిన మువ్వల దీనా కుమారి వినతిపత్రం అందజేసారు. ఫార్మాసిస్టు ఉద్యోగం కోసం పాడేరు మండలం కొత్త పాడేరుకు చెందిన కురసా అనూషలక్ష్మి దరఖాస్తును సమర్పించారు. ఎఎన్ఎం ఉద్యోగం కోసం చింతపల్లి మండలం కట్టుబంద గ్రామస్తురాలు కొట్టక్క కృష్ణవేణి వినతిపత్రం అందించారు. ఐటిడిఎ సరఫరా చేసిన జీడిమొక్కలను పెంచి 1986-87 నుంచి సాగులో ఉన్న జీడి తోటలకు పట్టాలు మంజూరు చేయాలని ముంచింగిపుట్టు మండలం మాకవరం గ్రామానికి చెందిన పాంగి రమేష్ కోరారు. పాడేరు మండలం తోటలగొంది అంగన్వాడీ కేంద్రానికి మరమ్మతులు చేపట్టాలని సర్పంచ్ వంతాల రాంబాబు, జి.ఈశ్వరరావు వినతిపత్రం సమర్పించారు. ఆర్ఒఎఫ్ఆర్ పట్టాల కోసం చింతపల్లి మండలం అంజలి శనివారం పంచాయతీ కోటల గరువు గ్రామానికి చెందిన పాంగి నాగమ్మ, కొర్రా ప్రసాద్, కొర్రా వసంత దరఖాస్తు చేసారు.కార్యక్రమంలో డిఆర్ఒ బి.దయానిధి, ఐటిడిఒ ఎపిఒ వివిఎస్ ప్రభాకరరావు, టిడబ్ల్యూ డిడి ఐ.కొండలరావు, ఇఇ డివిఆర్ఎం రాజు, పిఆర్‌పిఐయు ఇఇ కె.లావణ్య కుమార్, ఆర్అండ్‌బి ఇఇ బాలసుందరబాబు, డిఎల్‌పిఒ పిఎస్ కుమార్ పాల్గొన్నారు.

బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దు

ప్రజాశక్తి- పెదబయలు

బోయ, వాల్మీకులు, ఇతర ఉపకులాలను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దని డిమాండ్ చేస్తూ ఆదివాసీ హక్కుల పరిరక్షణ సమితి అధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ కూడలి జంక్షన్ వద్దకు సమూహంగా చేరుకుని, అంబేద్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జెఎసి నేత మర్రిచెట్టు పోతురాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం జిఒ 52, శామ్యూల్ ఆనంద్ కమిషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో ఆదివాసీలకు శతశాతం ఉద్యోగాలను కల్పించే చట్టాన్ని చేయాలని కోరూతూ చేపడుతున్న ఆదివాసీ హక్కుల పరిరక్షణ యాత్ర, ఈనెల 30న పాడేరులో ఆదివాసీ గర్జనను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. పరిరక్షణయాత్రకు సంబంధించి టూర్ షెడ్యూల్ కరపత్రాలను పంపిణీ చేశారు.

30న పాడేరులో ఆదివాసీ గర్జన
విజయవంతం చేయాలని ఆదివాసీ పరిరక్షణ యాత్ర

మాట్లాడుతున్న జెఎసి నేత కొండయ్య

బొర్రా పంచాయతీ సర్పంచ్‌కు చెక్ అందజేస్తున్న ఎంపిడిఒ

పంచాయతీ వాటా చెక్కు అందజేత

ప్రజాశక్తి -అనంతగిరి: ప్రముఖ పర్యాటక కేంద్రం బొర్రా గుహలకు వచ్చే ఆదాయంలో పంచాయతీ వాటా కింద రూ.లక్ష చెక్కును బొర్రా సర్పంచ్ జె.అప్పారావుకు స్థానిక ఎంపిడిఒ ఆర్జిత్ రాజ్యం శుక్రవారం అందజేశారు. పంచాయతీ కార్యాలయంలో చెక్‌ను అందజేసిన ఎంపిడిఒ, ఈ నిధులను పంచాయతీ అభివృద్ధికి వెచ్చించాలని సూచించారు. కొన్నేళ్లుగా బొర్రా గుహలకు వచ్చిన ఆదాయం నుంచి పంచాయతీ సెస్‌ను చెల్లించాలని పర్యాటకశాఖ అధికారులకు అనేకసార్లు మొరపెట్టుకున్నప్పటికీ ఎటువంటి స్పందన లేదని, అయితే తాజాగా సర్పంచ్ అప్పారావు వినతికి పర్యాటకశాఖ అధికారులు స్పందించి రూ.లక్ష నిధులను కేటాయించారని ఎంపిడిఒ తెలిపారు.

నేరాలు ఘోరాలు

కాంక్రీట్ మిక్సర్ లారీ పడి వ్యక్తి దుర్మరణం

- రూ.18 లక్షల నష్టపరిహారం ఇచ్చేందుకు అంగీకారం

ప్రజాశక్తి -ములగాడ : కాంక్రీట్ మిక్సర్ లారీకి సిగ్నల్ ఇస్తుండగా లారీతో పాటు ఓ వ్యక్తి గోతిలో పడి దుర్మరణం పాలైన ఘటన ఎంఇఎస్ సంస్థలో శుక్రవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి మల్కాపురం పోలీసుల కథనం ప్రకారం... మల్కాపురం పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న ఎంఇఎస్ ఆఫీసు వద్ద భవన నిర్మాణ పనుల్లో భాగంగా గోపాల్ టెక్నోఖాన్ కన్స్ట్రక్షన్ లిమిటెడ్ యొక్క కాంక్రీట్ లారీ వచ్చింది. అదే కంపెనీలో బుల్డోజర్ డ్రైవర్‌గా ఆరిలోవ ప్రాంతానికి దినేష్ (23) పనిచేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం కాంక్రీట్ లారీకి దినేష్ సిగ్నల్ ఇస్తుండగా అకస్మాత్తుగా రోడ్డు యొక్క మట్టి కుంగిపోయింది. దీంతో దినేష్ కాలు జారి గొయ్యిలో పడిపోయాడు. అతనిపై కాంక్రీట్ లారీ, మట్టి పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మల్కాపురం సిఐ లూథరబాబు సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి వివరాలను సేకరించారు. మృతుని కుటుంబానికి సమాచారం అందజేశారు. మృతుని కుటుంబ సభ్యులు వచ్చి బోరున విలపించారు.

18 లక్షలు నష్టపరిహారం చెల్లింపునకు అంగీకారం

మృతి చెందిన దినేష్ కుటుంబానికి రూ.18 లక్షల నష్టపరిహారం, రూ.6 లక్షలు పిఎఫ్ సొమ్మును అందించేందుకు కాంట్రాక్టర్ అంగీకరించారు. ఈ చర్చల్లో 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు, ఆరిలోవకు చెందిన పెద్దలు పాల్గొన్నారు.

బంగారం చోరీ కేసులో నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 12వ తేదీన జరిగిన దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. నగర పోలీస్ కమిషనర్ సమావేశ మందిరంలో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో క్రైమ్ డిసిపి జి.నాగన్న మాట్లాడుతూ 12వ తేదీ ఉదయం 6:20 గంటల సమయంలో డ్యూటీకి వెళ్లే నిమిత్తం ప్రహ్లాదపురం సింహాద్రి హాస్పిటల్ బస్‌స్టాప్ వద్ద బాధితురాలు ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు స్కూటీపై వచ్చి ఆమె మెడలోని 18 గ్రాముల బంగారం గొలుసును అపహరించికుపోయారన్నారు. దీనిపై బాధితురాలు కార్మెల్ మైఖేల్ పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ ఎమ్‌డి సల్మాన్ ఆధ్వర్యంలో దర్యాప్తు నిర్వహించారన్నారు. దీనిలో భాగంగా 14వ తేదీ ఉదయం భరత్‌నగర్, సింహపురి కాలనీ ఆర్చి వద్ద కుండాల రాజు, జాడిపల్లి జనార్ధన్, ఎల్లంపల్లి భానులను అరెస్టు చేసి విచారించగా వారు నేరాన్ని అంగీకరించినట్టు తెలిపారు. గతంలో వీరు మూడు దొంగతనాలు చేసినట్టు వెల్లడైందన్నారు. నిందితుల నుంచి 30 గ్రాముల బంగారు పూసల తాడు, 20 గ్రాముల బంగారు గొలుసు, 10 గ్రాముల బంగారు గొలుసు, ఒక హోండా డియో స్కూటీని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

వన భోజనాల్లో సీలేరు గ్రామస్తులు

'మన ఊరు - మన కలయిక' వన భోజనాలు

ప్రజాశక్తి - సీలేరు : మన ఊరు మన కలయిక అనే పేరుతో బాలాజీ లాడ్జి ఓనర్ నక్క జ్ఞానేశ్వరరావు, బొర్రా కృష్ణ, సదరం సత్తిబాబు, డి.చక్రరావు ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ఎత్తున వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వనభోజనాల్లో సుమారు 200 మంది సీలేరు గ్రామస్తులు పాల్గొన్నారు. చిన్నారులు ఆటపాటతో అలరించారు. మహిళలకు క్విజ్ పోటీలు నిర్వహించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-కొయ్యూరు : మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమం బాలుర పాఠశాల -2లో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. విద్యార్థులు పసుపు వేపాకు మిశ్రం కలిపి శుభ్రంగా స్నానం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ వేణుబాబు, రాజేంద్రపాలెం వైద్యా సిబ్బంది, ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నల్లగొండలో మాజీ ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని నల్లగొండ పంచాయతీలోని పలు గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పర్యటించారు. అక్కడ గిరిజనులతో మాట్లాడారు. ఇదే కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వైసిపి పాలనలో రైతులు, గిరిజనులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నేతలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఈశ్వరి

మత్స్యకారులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ సంక్షోభంలో ఉందని, ఈ తరుణంలో మత్స్యకారులను ఆదుకోవాలని ఎపి మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ కోరారు. ఫిషింగ్ హార్బర్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వేటకు వెళ్లి, మత్స్యకారులు తెచ్చే మత్స్య సంపదకు గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. లక్షల్లో నష్టం వస్తోందన్నారు. డీజిల్‌పై ఇస్తున్న సబ్సిడీని పెంచాలన్నారు. బోటు యజమానులకు బ్యాంకులు రుణాలు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ప్రధానమంత్రి కిసాన్ క్రెడిట్ కార్డులను మత్స్యకారులకు నేటి వరకూ ఇవ్వలేదన్నారు. ఈ పరిస్థితులను గుర్తించి ఆక్వా రైతుల వలే మెరైన్ సెక్టార్ మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గురువుల అవస్థలు

నేటితో ముగియనున్న బదిలీ దరఖాస్తుల గడువు
ప్రదర్శించని ఖాళీల జాబితా
వీడని సాంకేతిక సమస్యలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఉపాధ్యాయుల బదిలీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనే గడువు శనివారంతో ముగియనుంది. కానీ నేటికీ ఏ రకమైన జాబితాలూ ఉపాధ్యాయులకు అందకపోవడంతో వారంతా ఆందోళనకు గురువుతున్నారు. బదిలీ షెడ్యూల్ ప్రకారం ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీల వివరాలను 12, 13 తేదీల్లో తెలియజేయాల్సివున్నా, ఆ తరహా జాబితాను బహిర్గతం చేయలేదు. దీంతో బదిలీకి ఉపాధ్యాయులు దరఖాస్తులు పెట్టుకొనేందుకు సంకోచిస్తున్న పరిస్థితి ఏర్పడింది. ఉపాధ్యాయ ఖాళీలను విద్యాశాఖ ఇంకా ప్రకటించకపోవడంతో బదిలీ కావాల్సిన ప్రాంతం, పాఠశాల పేరు తెలియక ఉపాధ్యాయులు అవస్థలుపడుతున్నారు. ఉపాధ్యాయ ఖాళీల వివరాలన్నీ పెట్టాలని షెడ్యూల్‌లో ఇచ్చినా, ఖాళీల జాబితా పెట్టలేదు. హేతుబద్ధీకరణలో ఏయే స్కూళ్ల నుంచి ఏయే పోస్టులు, ఏయే మండలాలకు, ఏయే పాఠశాలలకు తరలిపోతున్నాయో అనే విషయం ఇంతవరకూ ఉపాధ్యాయులకు తెలియలేదు. హేతుబద్ధీకరణ ప్రక్రియలో ఏర్పడిన మిగులు పోస్టుల్లో ఏయే ఉపాధ్యాయులు హేతుబద్ధీకరణ గురై తప్పనిసరి బదిలీకి వచ్చారో అన్న విషయమూ ఉపాధ్యాయులకు తెలియలేదు. ఆయా జాబితాలను నేటి వరకూ జిల్లా విద్యాశాఖాధికారి వెబ్‌సైట్‌లో పొందుపర్చలేదు. మిగులు పోస్టుల్లో జూనియర్ టీచర్ వెళ్లాలన్న నిబంధన వుంది. అలా వెళ్లాల్సిన జూనియర్ టీచర్ ఎవరనేది లేదా అలా వెళ్లడానికి సమ్మతి తెలియజేసిన జూనియర్, సీనియర్ టీచర్ల ఎవరనేది అధికారులు ఇంకా గుర్తిస్తూనేవున్నారు. ఆ జాబితాను డిఇఒ వెబ్‌సైట్‌లో ప్రదర్శించలేదు. 150 మంది పిల్లల కంటే తక్కువున్న పాఠశాలలకు ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులను తీసేమని విద్యాశాఖ సూచించింది. 150 మంది కంటే ఎక్కువ మంది పిల్లలున్న పాఠశాలలు తక్కువ వుండడంతో, 150 కంటే తక్కువున్న పాఠశాలలకు మళ్లీ వారిని సర్దుబాటు చేయడంతో ఉపాధ్యాయులు గందరగోళానికి గురవుతున్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనే గడువు శనివారంతో అయిపోతున్నా, ఇప్పటికీ సాంకేతిక సమస్యలు వెంటాడుతూనేవున్నాయి. దీంతో అత్యధిక మంది ఉపాధ్యాయులు బదిలీకి దరఖాస్తు చేసుకోలేకపోయారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసినా పరిష్కారం కాకపోవడంతో పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు తరలివస్తున్నారు. యువర్ డిటేల్స్ నాట్ ఫౌండ్, ఉపాధ్యాయుడు జాయినింగ్ తేదీకి, ఆన్‌లైన్‌లో చూపిస్తున్న తేదీకి తేడా వుండడం, ప్రిఫరెన్షియల్ పాయింట్లు కనిపించకపోవడం, వేర్వేరు కేటగిరీల్లో పనిచేసిన ఉపాధ్యాయుల పూర్వపు కేటగిరీ కనిపించకపోవడం వంటి సాంకేతిక సమస్యలను ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్నారు. ఒటిపి రాక కొంతమంది ఉపాధ్యాయులు తమ దరఖాస్తు సబ్‌మిట్‌కాక సతమతమవుతున్నారు. ఏయే పాఠశాలలకు ఎన్ని కొత్త పోస్టులు మంజూరయ్యాయన్న విషయం ఇంకా కొలిక్కిరాలేదు. విద్యాశాఖ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఈ తాత్సారం జరుగుతోందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఒకపక్క ఇలాంటి సమస్యలతో ఉపాధ్యాయులు బాధపడుతుంటే, మరోపక్క ప్రభుత్వం నిబంధలన్నీ పక్కనపెట్టి కొంతమంది ఉపాధ్యాయులకు అక్రమ బదిలీ ఆర్డర్లు ఇస్తూవుండడం విమర్శలకు తావిస్తోంది.



Commissionerate Of School Education, Government of Andhra Pradesh
Teachers Transfers 2022
Online Application Form
ERRORS
• As Per DEO, You Availed Preferential Category in Last 5/8 years Please Contact DEO
NOTE
• Details furnished in the application are final.
Subsequent requests for corrections will not be entertained for wrong filling of application.

ఎనిమిదేళ్లు పూర్తయినా ప్రిఫరెన్షియల్ కేటగిరీ అప్లికేషన్ సబ్మిట్ కాకుండా డిఇఒను సంప్రదించాలని చూపిస్తున్న సాంకేతిక సమస్య

గడువు పెంచాలి

ఉపాధ్యాయులు బదిలీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనే గడువు పెంచాలి. టీచర్ల బదిలీకి సవాలక్ష నిబంధనలు పెట్టిన ప్రభుత్వం, ఏ నిబంధనా లేకుండా కొంతమంది అక్రమ బదిలీకి ఆర్డర్లకు రంగం సిద్ధం చేయడం అన్యాయం. నేటికీ ఖాళీల జాబితా, రేషనలైజేషన్‌లో పోతున్న ఉపాధ్యాయుల జాబితా ప్రదర్శించకపోవడం విచారకరం. వెంటనే వీటిని ప్రకటించి దరఖాస్తు చేసుకొనే గడువు పెంచాలి. అడ్డగోలు బదిలీలు ఆపాలి.

గొంది చినబ్బాయ్,
యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, అనకాపల్లి జిల్లా

అవినీతిపై టిడిపి కార్పొరేటర్ల నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జివిఎంసి స్థాయీ సంఘం సమావేశాలు అవినీతికి వేదికగా మారాయని టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు ఆరోపించారు. స్థాయీ సంఘ సమావేశాల పేరుతో అధికార వైసిపి నేతలు చేస్తున్న అవినీతి చర్యలను ఎండగడుతూ శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద టిడిపి కార్పొరేటర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ శుక్రవారం జరిగిన స్థాయీ సంఘ సమావేశం ఎజెండాలో పొందుపరిచిన అంశాలను ప్రస్తావిస్తూ.. ప్రతి సచివాలయానికీ ఒక క్లాప్ వాహనాన్ని కేటాయించారని, అవి కాకుండా 5, 6 జోన్లలో మూడు నెలల కాలానికి చెత్త సేకరణకు అద్దె వాహనాల కోసం రూ.73 లక్షలతో టెండర్లు పిలిచారని, దీని ఆమోదం కోసం స్థాయీ సంఘ సమావేశంలో అంశం చేర్చారన్నారు. స్థాయీ సంఘ సమావేశంలో రూ.50 లక్షలలోపు వాటికి మాత్రమే ఆమోదం తెలపవచ్చన్నారు. రూ.50 లక్షలు దాటితే కౌన్సిల్ సమావేశానికి ఆ అంశాన్ని తీసుకురావాలన్నారు. కౌన్సిల్‌లో ప్రతిపక్షాలు ప్రశ్నిస్తాయని, నిలదీస్తాయని భయపడి స్థాయీ సంఘ సమావేశంలో రూ.50 లక్షలు దాటిన పనులను కూడా ఆమోదిస్తున్నారని ఆరోపించారు వైర్‌లెస్ వాకీటాకీల కొనుగోలుకు రూ.44 లక్షలా 60 వేలా 400గా ప్రతిపాదించిన అంశంపై విచారణ జరపాలన్నారు. ఒక్కొక్క వాకీ టాకీ రూ.30 వేలుతో కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారని, వాటి ధర అంత ఉండదని అన్నారు. అలాగే జివిఎంసి పరిధిలో అర్హులైన పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాల కేటాయింపునకు ఉపయోగించే సాఫ్ట్‌వేర్ కోసం రూ.37.73 లక్షలు దేనికని ప్రశ్నించారు.

సందడిగా లయన్స్ ఇసామీ వేడుకలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాడిసన్ బ్లూ హోటల్‌లో ఈ నెల 16 నుంచి 19 వరకు నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ 50వ ఇసామీ ఫోరమ్ వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 14 దేశాల నుంచి 1850 మంది ప్రతినిధులు హాజరయ్యారు. అమెరికా, జపాన్, యుకె ప్రతినిధులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తొలుత సౌత్ ఆసియన్ లీడర్‌షిప్, ఇసామీ ఏరియా లీడర్‌షిప్ సమావేశాలు జరిగాయి. ప్లానింగ్ కమిటీ చైర్మన్ వంశీధర్ బాబు మాట్లాడారు. మధ్యాహ్నం తరువాత సెమినార్లు నిర్వహించారు. శనివారం ఉదయం 14 దేశాల నుంచి వచ్చిన లయన్స్ ప్రతినిధులతో ఆర్‌కె బీచ్‌లో డయాబిటిక్ ర్యాలీ నిర్వహిస్తున్నామని, భాషలు, ఆచారాలు వేరైనా తమ అందరి ప్రధాన కర్తవ్యం సేవని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఇసామీ హోస్ట్ కమిటీ అధ్యక్షులు విజయకుమార్ రాజు పాల్గొన్నారు.

ఆరోగ్య బీమాతో మేలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ (ఆర్‌జిఐసిఎల్) మొట్టమొదట ప్రీమియం ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశ పెట్టిందని రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి రాకేష్ జైన్ తెలిపారు. శుక్రవారం నగరంలోని ఓ హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అపరిమిత ప్రయోజనాలు అందించే రిలయన్స్ హెల్త్ ఇన్ఫినిటి పాలసీ ఇది అన్నారు. దీంతో రూ.5 కోట్ల వరకు ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు. పాలసీ తీసుకునే వారికి బహుమతులు కూడా లభిస్తాయన్నారు. గరిష్ట రక్షణ ఉంటుందన్నారు. ప్రత్యేకమైన వైద్య అవసరాలను తీరుస్తుందన్నారు. ఏడాది పాలసీ 13 నెలల వరకూ అమల్లో ఉంటుందన్నారు. వ్యక్తిగతంగాను, కుటుంబం అందరికీ కలిపి 8 మంది వరకు పాలసీ పొందవచ్చన్నారు. 90 రోజులు పైబడి వయసున్న పిల్లలు, 18 నుంచి 65 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న పెద్దలు ఈ పాలసీలో కవర్ చేయబడతారన్నారు.

రైళ్ల రాకపోకల్లో మార్పులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాస్కోడిగామా సమీపంలో డబ్లింగ్ పనులకు సంబంధించిన క్యాజిల్ రాక్ స్టేషన్ యార్డు పునర్నిర్మాణం దృష్ట్యా కొన్ని రైళ్లను హుబ్బల్లి జంక్షన్ వద్ద షార్ట్ టర్మినేట్ చేయనున్నారు. 18047 షాలిమార్ - వాస్కోడిగామా రైలు 2023 జనవరి 2, 3, 5, 7, 9, 10, 12, 14, 16, 17 తేదీల్లో షాలిమార్ నుంచి బయలుదేరి హుబ్బల్లి జంక్షన్ వద్ద షార్ట్ టర్మినేట్ అవుతుంది. అదే క్రమంలో 18048 వాస్కోడిగామా - షాలిమార్ రైలు 2023 జనవరి 5, 6, 8, 10, 12, 13, 15, 17, 19, 20 తేదీల్లో వాస్కోడిగామాకు బదులుగా హుబ్బల్లి జంక్షన్ నుంచి బయలుదేరుతుంది. ప్రజలు ఈ మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి విజ్ఞప్తి చేశారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎ3 ఇన్ఫ్రాస్ట్రక్చర్ చైర్మన్ అండ్ డైరెక్టర్ ప్రేమ్ చందు, కనకల ఈశ్వర్‌ల ఆధ్వర్యాన వారి కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ జాన్ వెస్లీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జివిఎంసి 29వ వార్డు కార్పొరేటర్ ఉరుకుటి నారాయణరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ శశికళ, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, చిన్నపరెడ్డి, నిఖిల్ తేజ, నర్సింగ్, అప్పలరాజు, ఎల్లపు శ్రీను, దండు, కిలాని వెంకటేష్, సారిపిల్లి వెంకు, శేఖర్, గురునాథ్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

3 నుంచి జర్నలిస్టుల ఆటల పోటీలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ జర్నలిస్టుల ఫోరం, సిఎంఆర్, విస్టా సంయుక్త ఆధ్వర్యంలో జనవరి 3 నుంచి జర్నలిస్టుల క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఫోరం అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు తెలిపారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాదీ నూతన సంవత్సర వేడుకులను ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. జనవరి 3 నుంచి పోర్టు ఇండోర్ స్టేడియంలో ఇండోర్ గేమ్స్ నిర్వహించనున్నామన్నారు. 5 నుంచి పోర్టు క్రికెట్ మైదానంలో జర్నలిస్టుల క్రికెట్ పోటీలు జరుగుతాయన్నారు.

624వ రోజుకు 'ఉక్కు' జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ దీనిని ప్రైవేటుపరం చేయొద్దని హెచ్‌పిసిఎల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు బి.వెంకటేశులు డిమాండ్ చేశారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు శుక్రవారానికి 624వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సంఘం మల్కాపురం జోన్ కార్మికులు కూర్చున్నారు.